సాక్షి

నిజామాబాద్

సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



ముగిసిన టోర్నీ

అడవి మామిడిపల్లిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ ఆదివారం ముగిసింది.

- 8లో ▸



గణపయ్యకు పూజలు

మండపాల్లో కొలువైన గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.8 /22.5

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'బదిలీల ఘనత పీఆర్‌టీయూదే'



నిజామాబాద్‌అర్బన్ : టీచర్ల బదిలీలు, పదోన్నతుల ఘనత పీఆర్‌టీయూదేనని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నో కోర్టు కేసులు ఉన్నా.. వాటిని అధిగమించి ప్రభుత్వాన్ని ఒప్పించి ఈ ప్రక్రియ జరిపిస్తున్నట్లు చెప్పారు. బదిలీల తర్వాత మిగిలిన ఖాళీలను స్పౌజ్ టీచర్ల బదిలీలతో భర్తీ చేయిస్తామన్నారు. సమస్య ఏదైనా పరిష్కారం కోసం పీఆర్‌టీయూ కృషి చేస్తుందన్నారు. సమస్యలు చెబితే చందాలు వసూలు చేసే వారి మాయాలో పడొద్దన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు మాట్లాడుతూ టీచర్ల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం బీఆర్‌ఎస్ హయాంలోనే జరిగాయన్నారు. అనంతరం పీఆర్‌టీయూ నాయకులు జెడ్పీ చైర్మన్‌ను సన్మానించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ 16 గేట్ల ఎత్తివేత

బాల్కొండ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఆదివారం రాత్రి వరద పోటెత్తింది. దీంతో అధికారులు 16 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 50 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. ఉదయం 25వేల క్యూసెక్కులు వచ్చిన వరద నీరు సాయంత్రానికి 22 వేల క్యూసెక్కులకు తగ్గింది. మళ్లీ రాత్రికి 35 వేల క్యూసెక్కులకు పెరిగి ఒక్క సారిగా 65వేల క్యూసెక్కులకు పెరిగింది. ఎగువ నుంచి మరింత వరద నీరు పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా 15వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 3 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300క్యూసెక్కులు, అలీసాగర్ లిప్టు ద్వారా 540 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కుల నీరు పోతుంది.

మంత్రి హరీశ్‌రావును కలిసిన వైద్యులు



నిజామాబాద్ నాగారం : తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వైద్యులు రాష్ట్ర వైద్య శాఖ మంత్రి హరీశ్‌రావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పీఆర్‌సీ బకాయిలు, ప్రొఫెసర్ల బదిలీ ఉత్తర్వులు విడుదల చేసినందుకు అసోసియేషన్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అన్వర్, జలగం తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు కిరణ్ మాదల, కిరణ్ ప్రకాశ్ పాల్గొన్నారు.

'అందరి సంక్షేమానికి కృషి చేస్తున్నా'



బాన్సువాడ: నియోజకవర్గంలో అందరి సంక్షేమానికి కృషి చేస్తున్నానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బాన్సువాడ బీడీ వర్కర్స్ కాలనీలో రూ. 25 లక్షలతో చేపట్టిన ముదిరాజ్ సంఘం ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం కొయ్యగుట్ట పీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ మాట్లాడారు. నియోజకవర్గంలో అన్ని కుల సంఘాలకు భవనాలు, కల్యాణ మండపాలను నిర్మించామన్నారు. కొత్త బాన్సువాడ ముదిరాజ్ సంఘం ఫంక్షన్ హాల్ నిర్మాణం, పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణం కోసం రూ. 50 లక్షలు నిధులు కేటాయిస్తున్నామన్నారు. ముందుగా స్పీకర్ నివాసం నుంచి బీడీ వర్కర్స్ కాలనీ వరకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు. తెలంగాణ అమరవీరుడు కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ చౌరస్తాలో స్పీకర్‌తోపాటు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిలను గజమాలతో సత్కరించారు.

కబ్జాకు గురైన భూమి



దర్జాగా కబ్జా!

- ఖిల్లా ప్రాంతంలో 28 ఎకరాల ఆక్రమణ
- రికార్డులు సృష్టించి మాయం
- అధికారులు, పలు పార్టీల నాయకుల హస్తం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన కరువు

నిజామాబాద్‌నాగారం : నగరంలో ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. దొంగ పత్రాలు సృష్టించి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. రూ.కోట్లు విలువ చేసే భూమిని మాయం చేస్తున్నారు. నిజామాబాద్ నగరంలోని ఖిల్లా ప్రాంతంలో సర్వే నంబర్ 2545, 3258లో ఎర్రకుంట(బొడ్డెమ్మ చెరువు) 28 ఎకరాల్లో ఉంది. ప్రస్తుతం ఆక్రమణలు పోనూ అక్కడ మిగిలింది కొన్ని గుంటల భూమి మాత్రమే. ఓ కాంగ్రెస్ నాయకుడు, ఎంఐఎం, అధికార పార్టీ నాయకులతో కలిసి ఆ భూమిని విక్రయించి అందిన కాడికి దోచుకున్నాడు.

దొంగ పత్రాలతో..

నగరంలోని ఖిల్లా ప్రాంతంలో ఎర్రకుంటకు సంబంధించి సుమారు 28 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని మాయం చేయడానికి కాంగ్రెస్ నాయకుడు కీలకంగా వ్యవహరించాడు. ఎంఐఎం, అధికార పార్టీ నాయకలతో కలిసి అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు అందించి దొంగ పత్రాలు సృష్టించి మాయం చేయడానికి పథకం వేశారు. ఈ భూమిపై 2016 నుంచే కన్నేసిన వారు తాజాగా అన్ని రికార్డులను అధికారులతో పద్ధతి ప్రకారం మార్పించిన్నట్లు తెలుస్తోంది. ఈ భూమి ఏళ్ల తరబడిగా రెవెన్యూ, సర్వే రికార్డులో శిఖం భూమి ఉంది. గతంలో తహసీల్దార్లు, ఆర్డీవో సైతం సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఏళ్ల తరబడిగా ఈ భూమిలో డంపింగ్ యార్డు ఉండేది.

జరిగింది ఇలా..

సర్వే నంబర్ 2545, 2358లో సుమారు 28 ఎకరాల చెరువు శిఖం భూమి ఉంది. 1965 నుంచి 2015 వరకు రికార్డుల్లో శిఖం భూమిగానే నమోదై ఉంది. కానీ అక్రమార్కులు 1965 కంటే ముందే 1955 వసూలు బాకీలో భాగంగా నాగారం సాయి అనే వ్యక్తి పేరుపై ఇనామ్ భూమి ఉన్నట్లు రికార్డుల్లో సృష్టించారు. తర్వాత నాగారం సాయి వారసులమంటూ చెప్పుకొని ఈ భూమి కోసం కొన్నేళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరిగి చివరకు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇక్కడ కేవలం డంపింగ్‌యార్డు ఉండగా, మూడు ఎకరాలు ఒక వ్యక్తికి, మరో మూడు ఎకరాలు మరో వ్యక్తికి చెందినదని, మిగితా భూమిలో శ్మశానాలు ఉన్నట్లు అప్పటి నిజామాబాద్ తహసీల్దార్ విశ్వనాథం తన పంచనామాలో ధ్రువీకరించిన్నట్లు సృష్టించారు. ఇందుకు సంబంధించిన పూర్తి నివేదిక గల కరెక్షన్ ఫైల్ ల్యాండ్ అండ్ సర్వే ఏడీ కార్యాలయంలో ఉండేలా జాగ్రత్త పడ్డారు. ఈ నివేదికను ఇద్దరు ఆర్డీవోలు, ముగ్గురు తహసీల్దార్లు సమర్థించిన్నట్లు కూడా సృష్టించారు. 2016లో ఓ సర్వేయర్‌ను భూమిని పరిశీలించడానికి పంపించారు. సదరు సర్వేయర్ డంపింగ్ యార్డు, శ్మశానాలు మినహా ఐదున్నర ఎకరాల ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉందని నివేదిక ఇచ్చారు. అయితే ఈ భూమిలో నుంచి ఎకరంనర ప్రభుత్వం నుంచి పట్టా పొందిన్నట్లు ఒక వ్యక్తి రికార్డులు సృష్టించి దానిని ఇతరులకు విక్రయించాడు. ఈ భూమిని కొనుగోలు చేసిన ఒక వర్గానికి చెందిన నాయకుడు మరో ఐదు ఎకరాలు తన పేరున 1980లోనే మార్పిడి జరిగినట్లు రికార్డులు సృష్టించాడు. ఐదెకరాలు కరెక్షన్ జరిగినట్లు ఫైల్ సృష్టించి కబ్జాదారుడికి అందజేశారు. 1980లో కరెక్షన్ జరిగిన ఫైల్ ఇటీవల టి పాస్ మ్యాప్‌లో రావడంతో రెవెన్యూ ల్యాండ్ సర్వే అధికారుల పనితీరు వెనుక ఎన్ని మాముళ్లు చేతులు మారాయో ఊహించవచ్చు. మరో రెండున్నర ఎకరాలు ఇంకో వ్యక్తి పేరిట ఉన్నట్లు సృష్టించారు.

ప్రస్తుతం అది కూడా కబ్జాకు గురైంది.

మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణంతో డిమాండ్

ఖిల్లా ప్రాంతంలో మినీ ట్యాంక్‌బండ్ నిర్మించడంతో మార్కెట్‌లో ఈ భూమికి మంచి డిమాండ్ ఉంది. మొత్తం 28 ఎకరాల భూమి విలువ రూ.100 కోట్లపైనే ఉంటుంది. దీంతో ఈ భూమిని ఎలాగైనా స్వాహా చేయాలని అక్రమార్కులు 2016 నుంచే స్కెచ్ వేశారు. ఇందులో భాగంగా అధికారులకు భారీ మొత్తంలో డబ్బులు ముట్టజెప్పడంతో ఈ సర్వేనంబర్‌లకు సంబంధించి రికార్డులను మార్చేశారు. అధికారులు రికార్డులు మార్పిడి తతంగం ముగించి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు. ఈ వ్యవహారంలో మాజీ కార్పొరేటర్‌లు, కాంగ్రెస్ నాయకుడు మధ్య వర్తిత్వం వహించి సుమారు రూ.కోటితో పని ముగించిన్నట్లు తెలిసింది.

భూమిని కాపాడాలని ఫిర్యాదుల వెల్లువ

ఖిల్లాలోని డంపింగ్ యార్డు భూమిని కాపాడాలని పలువురు నాయకులు అధికారులకు ఫిబ్రవరిలో ఫిర్యాదు చేశారు. ఫిబ్రవరి 20న నిర్వహించిన మున్సిపల్ బడ్జెట్ మీటింగ్‌లో బీఆర్‌ఎస్ కార్పొరేట్ బబ్లూఖాన్, ఎంఐఎం ఫ్లోర్ లీడర్ షకీల్ ప్రస్తావించారు. అలాగే కాంగ్రెస్ నాయకుడు సయ్యత్‌ఖైసర్ నగర కమిషనర్ విన్నవించారు. ఆగస్టు 25న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో పాటు ఇరిగేషన్ అధికారులకు ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి స్పందన లేదు. దీనిపై ఇరిగేషన్ డీఈ, ఏఈలను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదన్నారు.

శాంతిభద్రతలపై ఫోకస్

- నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టిన సీపీ
- గంజాయి, పేకాట, మట్కాపై ప్రత్యేక నిఘా
- రౌడీషీటర్లకు వార్నింగ్



ఖలీల్‌వాడి : పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. రౌడీ షీ టర్లతోపాటు గంజాయి, పే కాట, మట్కా ఆడేవారికి వా ర్నింగ్‌లు ఇవ్వడంతో పాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నా రు. తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన 20 రోజుల్లో ఏసీపీలు, సీఐలు, ఎస్సైలతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి పూర్తి సమాచారాన్ని సేకరించారు. ఇంటెలిజెన్స్, స్పెషల్‌బ్రాంచ్, టాస్క్ ఫో ర్స్ పోలీసులను అలర్ట్ చేసి శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇందు లో భాగంగా పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీచేసి సిబ్బందికి పలుసూచనలు చేశారు. పోలీస్ స్టేషన్లలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. సీపీగా బాధ్యతలు చేప ట్టిన 20 రోజుల్లోనే ఆయన డీఐజీగా నూ అదనపు బాధ్యతలు స్వీకరించారు.

మార్పు లేకపోతే పీడీ యాక్టు

గంజాయి రవాణా, విక్రయానికి పాల్పడుతూ కేసుల్లో ఉన్నవారు మారని పక్షంలో పీడీ యాక్టు నమోదు చేయాలని సిబ్బందిని సీపీ ఆదేశించారు. ఆర్మూర్ సబ్ డివిజన్‌లోని కమ్మర్‌పల్లి, మెండోరా, ముప్కాల్ మండలాల్లో గంజాయి విక్రయిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. గంజాయి విక్రయించే, తాగుతూ పట్టుబడిన వారిని వారం క్రితం పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రౌడీషీటర్ల కదలికలపై కన్ను

జిల్లాలో మొత్తం 260 మంది రౌడీషీటర్లు ఉన్నారు. మరికొంత మందిపై రౌడీషీట్ ఓపెన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ తెలిపారు. నగరంలోని ఒకటి, రెండు, మూడు, ఐదు, ఆరోటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వందమందికిపైగా రౌడీషీటర్లు ఉన్నారు. ఈనెల 20న జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో రౌడీషీటర్లకు సీపీ కౌన్సెలింగ్ చేశారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతోపాటు కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తామని హెచ్చరించారు. ఇతర ప్రాంతాలకు వెళితే స్థానిక పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలని వారికి సూచించారు. కౌన్సెలింగ్‌కు పలువురు రౌడీషీటర్లు హాజరు కాకపోవడంతో సంబంధిత పోలీసులపై సీపీ సీరియస్ అయ్యారు.

ఆపరేషన్ చబుత్రా

నగరంలో 'ఆపరేషన్ చబుత్ర' చేపట్టాలని సీపీ సిబ్బందిని ఆదేశించారు. నాలుగు, ఆరో టౌన్ పరిధిలో సీఐలు నరహరి, వెంకటనారాయణ అర్ధరాత్రి వేళల్లో వాహనాలపై తిరుగుతున్న యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇప్పటి వరకు రెండుస్టేషన్ల పరిధిలో 60 మంది యువకులకు పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. కార్డన్‌సెర్చ్ పకడ్బందీగా చేపట్టి అవగాహన కల్పిస్తున్నారు.

అథ్లెటిక్స్ ఎంపికలు పూర్తి

నిజామాబాద్ నాగారం : జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాగారంలోని రాజారాం స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్ ఆధ్వర్యంలో అండర్ 8, 10, 12, 14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలు, మెన్ అండ్ ఉమెన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఎస్‌హెచ్‌వో అప్పారావు, ఎస్సై సత్యనారాయణ, లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ సర్టిఫికెట్లను అందజేశారు. ఓవరాల్ చాంపియన్‌గా కేజీబీవీ సిరికొండ బాలికలు నిలిచారు. ఆర్మూర్ బాలుర గురుకుల పాఠశాల రెండో స్థానంలో నిలిచింది. రెంజర్ల నరేష్, పుప్పాల రవి, మార్టిన్, కపిల్ పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

రిమాండ్ ఖైదీ మృతి

- కల్తీ కల్లు దొరక్క అనారోగ్యం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత



యూసుఫ్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: ఆర్థిక కారణాలతో సొంత అక్కపై కత్తితో దాడిచేసి హత్య చేసిన వ్యక్తి.. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో మరణించాడు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 12న రాత్రి 10 గంటల ప్రాంతంలో మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్ తండా చౌ రస్తాలో రుక్సానా అనే మహిళను ఆమె తమ్ముడు షే క్ యూసుఫ్(34) హత్య చేశాడు. అతడిని మాచారె డ్డి పోలీసులు అరెస్ట్ చేసి 14 వ తేదీన కోర్టులో హాజరుపరిచారు. నిందితుడికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో కామారెడ్డి సబ్ జైలుకు తరలించారు. అప్పటి నుంచి జైలులో ఉంటున్న యూసుఫ్.. శారీరక, మానసిక ఒత్తిడికి గురై ఈనెల 22న తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో జైలు అధికారులు అతడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం యూసుఫ్ మరణించాడని కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు. నిబంధనల ప్రకారం కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పంచనామా నిర్వహించామన్నారు. నివేదిక, జైలు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. యూసుఫ్ అనారోగ్యానికి గురి కావడానికి ప్రధాన కారణం కల్తీ కల్లుకు అలవాటు పడడమే అని తెలుస్తోంది. జైలులో మత్తు పదార్థాలు దొరక్కపోవడంతోనే అతడు ఆస్పత్రి పాలైనట్లు పోలీసులు సైతం చెబుతున్నారు. నాలుగు నెలల క్రితం రిమాండ్ ఖైదీగా ఉన్న కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన భూమన్నగారి నర్సింలు (40) అనే వ్యక్తి సైతం ఇదే తరహాలో అనారోగ్యం పాలై మృతి చెందాడు. వరుసగా రిమాండ్ ఖైదీలు మృతి చెందడం ఆందోళనకు గురి చేస్తోంది.

క్యాంపు ఆఫీసులతో పాలన చేరువ

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ : దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు నిర్మించినట్లు రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండలో రూ.1.9 కోట్ల నిధులతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇప్పటి వరకు ప్రజల సౌకర్యార్థం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులు నిర్మించలేదన్నారు. క్యాంపు కార్యాలయాలు ఏ ఒక్క పార్టీకి చెందిన వారి సొత్తు కాదన్నారు. అధికారంలో ఉన్న ఎమ్మెల్యే వినియోగించుకోవచ్చని చెప్పారు. అధునాతనమైన సౌకర్యాలతో క్యాంపు కార్యాలయాలను నిర్మించినట్లు తెలిపారు. క్యాంపు కార్యాలయాలతో పాలన ప్రజలకు మరింత చేరువ అవుతుందన్నారు. గతంలో క్యాంపు కార్యాలయాలు లేక ప్రజా సమస్యలపై గెస్ట్ హౌస్‌లలో సమవేశాలు పెట్టుకునే దుస్థితి ఉండేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లావణ్య, జెడ్పీటీసీ దాసరి లావణ్య, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, సర్పంచ్ బూస సునీత, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, ఆర్డీవో వినోద్, ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



బాల్కొండలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

కేసీఆర్ సహకారంతో అభివృద్ధి

సీఎం సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని మంత్రి ప్ర శాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాల్కొండ మండల కేంద్రంతో పాటు, మండలంలోని వన్నెల్(బి) గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కోటి రూపాయాలకు తగ్గకుండా ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగులపల్లి భూదేవి, ఉప సర్పంచ్ కిషన్, పీఏసీఎస్ చైర్మన్ సురాజీరెడ్డి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మనోడికే 'బంధు'

- వృత్తిపని చేయని వారికి రూ.లక్ష సాయం
- అర్హులకు అందని బీసీబంధు
- మార్గదర్శకాలకు భిన్నంగా లబ్ధిదారుల ఎంపిక

■ మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన ముత్యం వడ్రంగి పని చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న తనకు బీసీబంధు ద్వారా రూ.లక్ష సాయం అందిస్తే విద్యుత్‌తో నడిచే పరికరాలను కొనుగోలు చేస్తానని ఆశించాడు. ఇటీవల బీసీబంధు ద్వారా రూ.లక్ష చొప్పున చెక్కులను పంపిణీ చేయగా, ఆ జాబితాలో ముత్యం పేరులేదు. వృత్తిపని నమ్ముకున్న తనలాంటి వారికి సాయం అందించకుండా, కులం ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేశారని అంటున్నాడు. కులవృత్తి చేయని వారికి సాయం అందించిన నాయకులు తమలాంటి వారికి మొండిచేయి చూపారని ముత్యం ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



మోర్తాడ్(బాల్కొండ): బీసీ చేతివృత్తిదారులకు సాయం అదించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఎంతో మంది కుల వృత్తుల వారికి బీసీ బంధు అందించకుండా, కులం ఆధారంగా ఎలాంటి వృత్తి పని చేయనివారికి సాయం అందించారనే విమర్శలున్నాయి. బీసీ బంధు తొలివిడతలో నియోజకవర్గానికి 300 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.లక్ష సాయం అందించిన విషయం తెలిసిందే. జిల్లాలో 1,500 మందికి సాయం అందించగా, అందులో అనర్హులే ఎక్కువగా ఉన్నారనే ఆరోపణలున్నాయి. బీసీబంధు కింద జిల్లాలో 21,125 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రతి నెలా బీసీబంధు పథకం ద్వారా లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. తొలి విడత రెండు నెలల ఆలస్యంగా మొదలైంది. ఈ నెలలో రెండో విడుత సాయం అందించాల్సి ఉంది. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయాలు ఉండవని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది.

గుట్టుచప్పుడు కాకుండా కమీషన్లు..

బీసీబంధు పథకం కింద ఎంపికైన లబ్ధిదారుల నుంచి కొందరు అధికార పార్టీ నాయకులు గుట్టుచప్పుడు కాకుండా కమీషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాయం చెక్కు ఇవ్వడానికి ముందుగానే లబ్ధిదారులతో బేరం కుదుర్చుకుని రూ.15వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కమీషన్ ఎందుకు ఇవ్వాలి? అని ప్రశ్నించే వారికి చెక్కులు ఇవ్వడం లేదని పలువురు పేర్కొంటున్నారు. తమకు కమీషన్ ఇచ్చిన విషయం బయటికి చెప్పకుండా ఉండేవారినే ఎంపిక చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. బీసీబంధు ద్వారా లబ్ధిపొందిన పలువురు.. కులవృత్తిని అభివృద్ధి చేసుకోవడానికి కాకుండా తమ సొంత అవసరాలకు ప్రభుత్వం అందించిన రూ.లక్షను ఖర్చు చేస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

అనర్హులను ఎంపిక చేశారు



బీసీ బంధు పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నాటకంగా సాగింది. అర్హులను పక్కనపెట్టి.. అనర్హులను అందలం ఎక్కించారు. పక్కాగా విచారణ చేయిస్తే అక్రమాలు బయటపడే అవకాశం ఉంది. వృత్తిని నమ్ముకున్నవారిని కాదని అసలు కుల వృత్తి చేయని వారికి ఎలా సాయం అందిస్తారు.

– శివన్నోళ్ల శివకుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు

అధికార పార్టీ అండదండలతోనే..



బీసీ బంధు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో అధికార పార్టీ నాయకుల అండదండలతోనే అక్రమాలు జరిగాయి. అసలైనవారికి సాయం అందించకుండా తమ వారికి రూ.లక్ష అందించారు. ల బ్ధిపొందిన వారెవరూ వృత్తి పని కోసం నిధులు ఖ ర్చు చేయడం లేదు. ఈ వ్యవహారంపై విచారణ చే యించాలి.

– తక్కూరి సాగర్, బీసీ నాయకుడు, మోర్తాడ్

ప్రతిపక్షాల మాటలకు మోసపోవద్దు

- అన్నివర్గాల సంక్షేమానికి కేసీఆర్ కృషి
- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- సిర్పూర్ కోట అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మోపాల్ : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష పార్టీల నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. సీఎం కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మండలంలోని సిర్పూర్ కోట సుందరీకరణ పనులకు నుడా నుంచి రూ.50లక్షలు మంజూరు కావడంతో నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారు మోహన్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌తో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా సీసీ రోడ్డు, మన ఊరు–మన బడి పనులు, అంగన్‌వాడీ కేంద్రం, బెస్త సంఘం, మహిళా సమాఖ్య భవనాలను ప్రారంభించారు. బాజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకులు అబద్ధపు ప్రచారాలు చేసుకుంటూ గ్రామాల్లోకి వస్తున్నారన్నారు. ఐదేళ్లు కావస్తున్నా.. ఇంతవరకూ పసుపుబోర్డు దిక్కులేదని ఎంపీ అరివ్వింద్‌నుద్దేశించి విమర్శించారు. అభివృద్ధి ఎవరు చేస్తున్నారో.. మాటలు ఎవరు చెప్తున్నారో ప్రజలు గ్రహించాలని, రాబోయే రోజుల్లో బీజేపీ, కాంగ్రెస్ నాయకులను తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. మల్లారం డెంటల్ కళాశాల నుంచి మోపాల్ మండల కేంద్రం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అన్ని కుల సంఘాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని గుర్తుచేశారు.

పర్యాటక కేంద్రంగా కోట..

సిర్పూర్ కోట సుందరీకరణ కోసం నుడా నుంచి రూ.50లక్షలు మంజూరయ్యాయని, ఆ నిధులతో కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని బాజిరెడ్డి పేర్కొన్నారు. అవసరమైతే మరిన్ని నిధులు సమకూర్చుతామని, కోటలో మినీ ఫంక్షన్ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన వినాయక మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సామ ముత్యంరెడ్డి, మొచ్చ శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, కోర్వ దేవేందర్, చంద్రశేఖర్‌రెడ్డి, లింగన్న, ఉమాపతిరావు, మోహన్‌రెడ్డి, భూమయ్య, సంతోష్, గంగాప్రసాద్, సాగర్ పాల్గొన్నారు.



కోట సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

క్లుప్తంగా

అంతర్జాతీయ సదస్సులో జిల్లా న్యాయవాదులు



ఖలీల్‌వాడి: న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శని, ఆదివారాల్లో నిర్వహించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అంతర్జాతీయ న్యాయవాదుల సదస్సులో తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డి, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవీదాసు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధనుంజయ యశ్వంత్ చంద్రచూడ్, బార్ కౌన్సిల్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ జాతీయ, అంతర్జాతీయ చట్టాలపై వివరించినట్లు వారు ఈ–మెయిల్ ద్వారా సదస్సు వివరాలు తెలిపారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైన టీఎస్‌పీఎస్సీని వెంటనే ప్రక్షాళన చేయాలని తెయూ భారత విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం తెయూ సెంట్రల్ లైబ్రరీ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, టీఎస్‌పీఎస్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ భర్తీలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నవీన్, రాకేశ్, గణేశ్, చిత్రబ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ విశాల్‌కు బెస్ట్ సైకియాట్రిస్ట్ అవార్డు



ఖలీల్‌వాడి: జిల్లాకు చెందిన న్యూరో సైకియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ విశాల్‌కు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బంజారాహిల్స్ బ్రాంచ్ ఆధ్వర్యంలో బెస్ట్ సైకియాట్రిస్ట్ అవార్డును ఆదివారం హైదరాబాద్‌లో అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వేణుగోపాల్ చారి, ప్రముఖ సినీ హీరో సుమన్, నిజామాబాద్ సీపీ సత్యనారాయణ, ప్రముఖ వైద్యులు మధుశేఖర్, జార్జిరెడ్డి, ఫణికాంత్, తెలంగాణ సైకియాట్రిక్ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

కురుమలకు గొర్రెలను పంపిణీ చేయాలి



కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కురుమలకు గొర్రెలను పంపిణీ చేయాలని కురుమ చైతన్య సమితి జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు చెట్టుకూరి రజినీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. గొర్రెల పెంపకందారులందరికీ బీమా పథకాన్ని అమలు చేసి పింఛన్ అందించాలని కోరారు. జిల్లా సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అంబల్ల సాయి నిఖిల్, కో–ఆర్డినేటర్ జీవీఎం విఠల్, ఉపాధ్యక్షుడు గంగాధర్ పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్..





పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ, యువజన సంఘాల మండపాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు సంబంధించి 'సాక్షి' సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సాప్ చేయగలరు.

పంపించాల్సిన వాట్సాప్ నెం.
8978036828



మేఘరాజ్ (నిజామాబాద్)



నూత్‌పల్లిలో చిన్నారులు



వెంకటపూర్‌లో..



శ్రీకాంత్, నిజామాబాద్



శ్రేయాన్స్, మౌనిక (వినాయక్‌నగర్)



బజరంగ్‌యూత్, లక్కంపల్లి



లోకేశ్వర్, దేవునిగుట్ట తండా



శ్రీనిధి మహిళా మండలి, న్యూ ఎన్జీవోస్ కాలనీ



ఆలూర్‌లో..



మిథాలీ, మనస్వీ (భీంగల్)



సాదుల నితేశ్ (నూత్‌పల్లి)



వైశ్యరత్న గణేశ్, రానాగల్లీ



మంచాల జ్ఞానేందర్‌గుప్తా, నిజామాబాద్



నందిపేట్ మండలం వెల్మల్‌లో..



యూత్ గణేశ్ మండలి, ముల్లంగి



పద్మశాలీ గణేశ్ మండలి, నల్లవెల్లి

ముగిసిన బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ



బహుమతులు అందుకుంటున్న విజేతలు

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న జిల్లా స్థాయి 42వ సబ్ జూనియర్ బాల, బాలికల బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిశాయి. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాలుర విభాగంలో 13, బాలికల విభాగంలో 11 టీంలు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాల బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలువగా, డిచ్‌పల్లి మండలం ధర్మారంలోని బాలికల గురుకుల పాఠశాల బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌కు చెందిన సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన జట్టు ప్రథమ స్థానం, మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ జడ్పీ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అనంతరం విజేత జట్లకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింత మల్లారెడ్డి, బాల్ బ్యాడ్మింటన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్, విద్యాసాగర్‌రెడ్డి, వ్యాయామ సంఘం కోశాధికారి రాజేందర్, పాఠశాల హెచ్‌ఎం బాబురావు, భూపతి, భారతి, మాధురి, వీడీసీ అధ్యక్షుడు కాలేవార్ రాజులు పాల్గొన్నారు.

తల్లిని గెంటేసిన కుమారులు

- సఖి సెంటర్‌కు తరలించిన పోలీసులు



లక్ష్మిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చిన పోలీసులు

ఖలీల్‌వాడి: మానవత్వం మంట కలిసింది. కుమారులు ఇంటి నుంచి బయటకు గెంటి వేయడంతో నిస్సహాయంగా మారిన ఓ తల్లిని పోలీసులు చేరదీసి సఖి సెంటర్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ పట్టణంలోని గాయత్రినగర్‌కు చెందిన గంట్యాల లక్ష్మికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. భర్త జీవించి ఉన్నప్పుడే ఇద్దరు కూతుళ్లతోపాటు పెద్ద కుమారుడికి వివాహమైంది. కొన్నేళ్ల క్రితం భర్త చనిపోయాడు. దీంతో లక్ష్మి ఇంటిని అమ్మి చిన్న కూతురుతోపాటు చిన్న కుమారుడి వివాహం జరిపించింది. అప్పటి నుంచి పెద్ద కూతురు వద్ద ఉంటోంది. కొడుకుల వద్ద ఉండాలని పెద్ద కూతురు తల్లికి సూచించడంతో.. కుల పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. తల్లి వద్ద ఉన్న బంగారం, నగదు తనకు ఇవ్వాలని, అలాగైతేనే తాను పోషిస్తానని చిన్న కుమారుడు చెప్పడంతో కులపెద్దలు బంగారం, నగదు ఇప్పించారు. కొన్నాళ్లకే తల్లిని బయటికి వెళ్లగొట్టిన చిన్నకుమారుడు.. తులం బంగారం తీసుకువస్తేనే పోషిస్తానని చెప్పాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో లక్ష్మి సమీపంలోని గణేశ్ ఆలయం వద్ద ఉంటోంది. ఈ విషయం తెలుసుకున్న నిజామాబాద్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరహరి ఆధ్వర్యంలో నాలుగో టౌన్ ఎస్సై సంజీవ్, ఏఎస్సై నరసింహులు, కానిస్టేబుల్ సాయన్న ఆమె వద్దకు వెళ్లి మాట్లాడి, పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. భోజనం చేయించి, సఖి సెంటర్‌కు తరలించారు. లక్ష్మి కుమారులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామని టౌన్ సీఐ నరహరి తెలిపారు. తల్లిని పోషించకపోతే సీనియర్ సిటిజన్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

స్నూకర్ స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని మాలపల్లిలో ఉన్న స్నూకర్స్ స్థావరంపై సీపీ ఆదేశాల మేరకు దాడి నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. ఈ దాడిలో 20 మందిని అరెస్టు చేసి 12 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వీరిని ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబుకు అప్పగించినట్లు వెల్లడించారు.

నస్రుల్లాబాద్ పీఎస్ పనితీరు భేష్



నస్రుల్లాబాద్(బాన్సువాడ): రాష్ట్రస్థాయిలో నస్రుల్లాబాద్ పోలీస్‌స్టేషన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం వార్షిక పనితీరు నిర్వహణలో భాగంగా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జిల్లాలో నస్రుల్లాబాద్ మండల పరిధిలో రోడ్డు ప్రమాదాల వల్ల ఒక్క మరణం కూడా సంభవించలేదన్నారు. రాష్ట్ర స్థాయిలో మొదటి 30 పీఎస్‌లలో నస్రుల్లాబాద్ ఒక్కటి అని అన్నారు. దొంగతనాలు, మిస్సింగ్ కేసులు దాదాపు పూర్తి చేశారన్నారు. గత ఎస్సై రంజిత్‌రెడ్డి, ప్రస్తుత ఎస్సై తిరుపతిల పనితీరును అభినందించారు. ఆయన వెంట సీఐ మరళి, సిబ్బంది ఉన్నారు.

స్పీకర్‌కు మద్దతు తెలిపిన ఇబ్రహీంపేట్ గ్రామస్తులు

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన ముస్లింలు ఆదివారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఆయన నివాసంలో కలుసుకున్నారు. మైనార్టీ విద్యార్థులకు గురుకుల పాఠశాలలు, పేదింటి ఆడబిడ్డల పెళ్లికి షాదీముబారక్, స్వయం ఉపాధి కోసం మైనార్టీ బంధు లాంటి పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లోనూ తమ మద్దతుగా ఉంటామని లేఖను అందజేశారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాలను తరిమేద్దాం



సభలో మాట్లాడుతున్న గోవా పీసీసీ అధ్యక్షుడు అమిత్ పాట్కర్

- గోవా పీసీసీ అధ్యక్షుడు అమిత్ పాట్కర్

బిచ్కుంద(జుక్కల్): కేంద్రం, రాష్ట్రంలో కొనసాగుతున్న అవినీతి ప్రభుత్వాలను పాలద్రోలుదామని కాంగ్రెస్ నియోజకవర్గ పర్యవేక్షకుడు, గోవా పీసీసీ అధ్యక్షుడు అమిత్ పాట్కర్‌అన్నారు. బిచ్కుందలో మాజీ ఎమ్మెల్యే గంగారాం అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అధిక ధరలతో ప్రజల రక్తాన్ని తాగి దేశాన్ని భ్రష్టుపట్టించారని అన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందన్నారు. జుక్కల్‌లో మూడు సార్లు గెలుపొందిన స్థానిక ఎమ్మెల్యేగా ప్రజల సమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2004 ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని రైతులకు రుణమాఫీ, ఉచిత కరెంటు ఇవ్వడం జరిగిందని అన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఇచ్చిన మ్యానిఫెస్టో ప్రకారం అన్ని హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగెట్ సభ్యుడు విఠల్‌రెడ్డి, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్, జిల్లా యూత్ అధ్యక్షుడు గజ్జు పటేల్, సీనియర్ నాయకులు మల్లికార్జునప్ప శెట్కార్, నాగ్‌నాథ్, ఖలీంపటేల్, గౌస్, గంగాధర్, దాదారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్నూరుకాపు ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కామారెడ్డి అర్బన్: మున్నూరుకాపు ఉద్యోగులు ఐక్యంగా ఉండి విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన మున్నూరుకాపులకు సహకారం అందించాలని తెలంగాణ మున్నూరుకాపు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాల శ్రీనివాస్‌పటేల్ అన్నారు.

పట్టణ పరిధిలోని దేవునిపల్లి మున్నూరుకాపు సంఘంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జిల్లాలో డివిజన్ల వారిగా కమిటీలు ఏర్పాటు చేసి అసోసియేషన్‌ను విస్తరించాలని సూచించారు. అనంతరం అసోసియేషన్ జిల్లాశాఖ తాత్కాలిక కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నీలం రాజులు, గౌరవ అధ్యక్షుడిగా సుదర్శనం రాములు, అసోసియేట్ అధ్యక్షులుగా సోమన్నగారి బాల్‌కిషన్, మధుకృష్ణ, ఆముదాల భానుశంకర్, ఉపాధ్యక్షులుగా ఆకుల కిష్టయ్య, టి.హన్మాండ్లు, ఎం.దేవేందర్, ముదాం శ్రీధర్, పటేల్ అనిల్, సంగెం సతీశ్, గుర్రం నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా బండిగారి విజయ్, కోశాధికారిగా తిపిరిశెట్టి లింగారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా సంగెం శ్రీనివాస్, సోంశెట్టి రాము, నాగం చిరంజీవులు, సలహాదారులుగా సుతారి అంజయ్య, కార్యవర్గసభ్యులుగా ముదాం మహేశ్, యెంబరి లింగం ఎన్నికయ్యారు.

స్కేటింగ్, బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపికలు



నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ క్రీడలకు సంబంధించి స్కేటింగ్, బాక్సింగ్‌లో ఆదివారం ఎంపిక పోటీలు నిర్వహించారు. క్రీడల కార్యదర్శి సంగీత్ రావు ఆధ్వర్యంలో ఎంపికలు చేశారు. స్కేటింగ్‌లో అండర్–11 నుంచి అండర్–17 బాలబాలికలకు, బాక్సింగ్‌లో వివిధ కేటగిరిల్లో ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఈటీ, పీడీలు మల్లేశ్‌గౌడ్, వెంకటేశ్, రమేశ్, గణేశ్, రామ్‌చందర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి



బాల్‌రెడ్డి (ఫైల్)

భిక్కనూరు: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన ఘటన మండలంలోని తిప్పాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి (49) తన పంటలో బోరు మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జేఎల్‌ఎంకు తీవ్రగాయాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన జేఎల్‌ఎం పిల్లి రాజయ్యకు విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. అయ్యపల్లి శివారులోని 11 కేవీ విద్యుత్ స్తంభంపై తీగలు సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురైనట్లు పేర్కొన్నారు. స్థానికులు వెంటనే రాజయ్యను కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు.

కోతుల దాడిలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శనివారం రాత్రి కోతుల దాడిలో బుజ్జాగౌడ్ అనే వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. బుజ్జాగౌడ్ ఎల్లమ్మ ఆలయం వద్ద వాకింగ్ చేస్తుండగా నాలుగు కోతులు దాడిచేసి గాయపర్చాయి. దీంతో బాధితుడిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కోతులతో పాటు కుక్కల బెడద తీవ్రంగా ఉందని రోడ్లపై నడవాలంటే భయంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దర్యాపూర్‌లో పిడుగు



పిడుగు పడిన ప్రాంతంలో వెలువడుతున్న పొగ

నవీపేట: మండల కేంద్రంలోని దర్యాపూర్ కాలనీలో ఆదివారం సాయంత్రం పిడుగు పడింది. 15 రోజుల క్రితం ఇదే ప్రాంతంలో పిడుగు పడింది. తాజాగా 60 మీటర్ల దూరంలో మరో పిడుగు పడగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కురుస్తున్న అకాల వర్షాలతో పాటు ఒకే ప్రాంతంలో పడుతున్న పిడుగులతో కాలనీవాసులు భయపడుతున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలకు జంకుతున్నారు. పిడుగు పడిన ప్రదేశంలో దట్టమైన పొగ రావడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు.

గాయత్రీనగర్‌లో దొంగల హల్‌చల్



బంగారం చోరీ చేసిన బీరువా

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి, గాయత్రీనగర్‌లో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. తాళం వేసిన మూడు ఇళ్లల్లోకి చొరబడి బంగారం, నగదు అపహరించారు. కాలనీకి చెందిన చిట్బోజి నాగరాజు కుటుంబం శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి బంధువుల శుభకార్యానికి నార్సింగ్‌కు వెళ్లారు. గమనించిన దుండగులు తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 4.9 తులాల బంగారం, ఆభరణాలు, నగదు దొంగిలించారు. అదే కాలనీలోని బండ్ల శ్రీకాంత్, సతీశ్ కుమార్‌ల ఇండ్ల తాళాలను పగులగొట్టి చోరీకి యత్నించారు. ఆదివారం ఉదయం చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు ఎస్సై రాజు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నిందితుల పట్టివేత

బాన్సువాడ: నియోజవర్గంలో ఆరు నెలలుగా బైకులను చోరీకి పాల్పడుతున్న నిందితులను పట్టుకున్నట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టగా ముగ్గురు నిందితుల వద్ద సరైన వాహన పత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. విచారణలో నస్రుల్లాబాద్‌కు చెందిన ఉల్లెంగ ప్రవీణ్, మైలారం గ్రామానికి చెందిన ఒడ్ల శేఖర్, పొతంగల్‌కు చెందిన కదల గంగాధర్‌లు కలిసి పలు చోట్ల రూ.7లక్షల విలువైన 10 బైక్‌లను దొంగిలించినట్లు నిందితులు ఒప్పుకున్నారు. అనంతరం నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్సై పి. మశ్రీందర్‌రెడ్డి, సిబ్బంది చంద్రయ్య, రాములు, సాయికుమార్ ను అభినందించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): చేపల చెరువులో గల్లంతైన మృతదేహం ఆదివారం లభ్యమైన ఘటన మండలంలోని గోపాల్‌పేటలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాజేశ్ స్నేహితుడు లక్ష్మీనారాయణతో కలిసి గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టేందుకు శుక్రవారం వెళ్లారు. చెరువులో ప్రమాదవశాత్తు రాజేశ్ మునిగిపోయాడు. గమనించిన లక్ష్మీనారాయణ స్థానికుల సహాయంతో వెతికినా మృతదేహం లభించలేదు. మృతదేహం ఆదివారం బయటకు తేలడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి రాజేశ్‌స్నేహితులు రూ. పదివేల ఆర్థికసాయం అందజేశారు.